క్లుప్తంగా

కృష్ణా యూనివర్సిటీ రన్నరప్‌గా కైకలూరు జట్టు

కైకలూరు: కృష్ణా యూనివర్సిటీ బాల్‌బాడ్మింటెన్ పోటీలు ఇటీవల కృష్ణాజిల్లా మొవ్వ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో నిర్వహించారు. ఈ పోటీలో కైకలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. కాలేజీలో క్రీడాకారులు, ఫిజికల్ డైరెక్టర్ ఎస్‌డీవీ సత్యనారాయణను అధ్యాపకులు సోమవారం సన్మానించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ఉదయప్రకాష్, అధ్యాపకులు నున్న శ్రీనివాస్, లావణ్య, నరసింహారావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ముమ్మరంగా పెన్షన్ల పంపిణీ

పామర్రు: సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు సంయుక్తంగా మండలంలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండల పరిధి కనుమూరు గ్రామంలోని సచివాలయ కన్వీనర్లు యార్లగడ్డ వెంకటేశ్వరరావు(కొండ), తలచట్ల ఆంజనేయులు, దిరిశన ఉషారాణిల ఆధ్వర్యంలో సోమవారం గ్రామంలో కొత్త పెన్షన్లను పంపిణీ చేశామని గ్రామ పార్టీ నాయకుడు యార్లగడ్డ రవీంద్రబాబు తెలిపారు. ఎంపీటీసీ యార్లగడ్డ పావని, పార్టీ నాయకుడు ఎం.విశ్వనాథశర్మ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించాలి

గుడివాడరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు మెరుగైన సేవలు అందించాలని వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి వ్యవసాయ సహాయకులకు సూచించారు. మండల పరిధిలోని లింగవరం గ్రామంలో ఉన్న రైతుభరోసా కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల వ్యవసాయశాఖ అధికారి బి.అనంతలక్ష్మితో కలిసి సోమవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా రంగు మారిన ధాన్యం కొనుగోలు ప్రక్రియపై రైతులకు అవగాహన కల్పించారు. అగ్రికల్చరల్ అసిస్టెంట్ నాగలక్ష్మి, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ లయన్స్ క్లబ్‌గా గుడ్లవల్లేరు

గుడ్లవల్లేరు: మెడికల్ క్యాంపులు నిర్వహించటంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు ఉత్తమ క్లబ్‌గా అవార్డు దక్కించుకుందని క్లబ్ అధ్యక్షుడు సింగంశెట్టి ఆదినారాయణ సోమవారం తెలిపారు. విజయవాడలో ఆదివారం రాత్రి జరిగిన కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ శ్రీశాంతి చేతుల మీదుగా అవార్డు అందుకున్నామన్నారు. లయన్స్ ప్రతినిధులు వైవీసీ ప్రసాద్, జీఎస్ బోస్, శ్రీరామ్మూర్తి, ఫణిగోపాల్, విశ్వం, చిట్టిబాబు, చంద్రశేఖర్ ఉన్నారు.

ఏపీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

తోట్లవల్లూరు: మండల విద్యాశాఖ కార్యాలయంలో ఏపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడు కేపీ రవికాంత్ ఆధ్వర్యంలో సోమవారం క్యాలెండర్‌ను ఎంఈఓ జి.వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. మండల ప్రధాన కార్యదర్శి ఎలీషారావు, కార్యదర్శి రమణ, కోశాధికారి కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపారుపూడి: ఐసీడీఎస్ సీడీపీఓ వి.భానుశ్రీ ఆదేశాల మేరకు మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ సహాయకుల పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు మండల సూపర్‌వైజర్ ఎం.నాగమణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పెదపారుపూడిలోని అంగన్‌వాడీ సెంటర్-3 లో ఎస్సీ మహిళ, వెంట్రప్రగడ-2లో జనరల్ మహిళ, వెంట్రప్రగడ-3లో బీసీ-డీ మహిళలకు కేటాయించామన్నారు. ఈ నెల 11వ తేదీలోగా దరఖాస్తులను పామర్రు సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

తోట్లవల్లూరు మండలంలో ఖాళీలు

తోట్లవల్లూరు: కనకవల్లిలో అంగన్‌వాడీ కార్యకర్త(బీసీ-బీ), తోట్లవల్లూరు ఎస్సీ ఏరియాలో అంగన్‌వాడీ సహాయకురాలు(ఎస్సీ) పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి ఎస్.ఆరుద్ర తెలిపారు. ఈ నెల 17వ తేదీలోగా ఉయ్యూరు ఐసీడీఎస్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

కనులపండువగా కల్యాణం

జమీదగ్గుమిల్లి(పామర్రు): జమీదగ్గుమిల్లి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో శ్రీనివాస కల్యాణోత్సవం సోమవారం కనులపండువగా జరిగింది. అన్న సమారాధన చేశారు. కాకర్ల శాయిబాబు, శివనాగమణి, కాకర్ల సీతారామాంజనేయ స్వామి, చంద్రవతి, త్రినాథ్ హారిక దంపతుల ఆధ్వర్యంలో పూజలను చేశారు.

చెరువులను ఆక్వా జోన్‌కు మార్పు చేసుకోవాలి

కైకలూరు: నాన్ ఆక్వాజోన్‌లో చెరువుల విస్తీర్ణం, సర్వే నంబరుతో సహా ఆక్వాజోన్‌లోకి మార్పు చేసుకోవాలని గ్రామ మత్స్యశాఖ సహాయకుడు రాజేష్ సోమవారం తెలిపారు. ప్రతి గ్రామంలో గ్రామసభలను ఏర్పాటు చేస్తామన్నారు. రైతులు ఆ సభలకు వచ్చి వివరాలను అందించాలని కోరారు. మరిన్ని వివరాలకు ఆయా గ్రామాల్లో మత్స్యశాఖ సహాయకులను సంప్రదించాలన్నారు.

ఎస్‌టీఓకు అభినందనలు

పామర్రు: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని పామర్రు గ్రామంలోని పలుశాఖల అధికారులను కలిసి శుభాకాంక్షలను తెలిపామని పామర్రు మండల విశ్రాంత ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు సంగం సుబ్బారెడ్డి అన్నారు. స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయం, రెవెన్యూ, మండల పరిషత్, విద్యాశాఖ తదితర అధికారులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఎంఆర్‌కె.ఆచార్యులు, నందిపాటి నాగిరెడ్డి, కె.వీరయ్య, భీమవరపు శివశేషమణి, జి.పాలు రాజు, జి.అచ్చియ్య, బి.సీతా రామిరెడ్డి, బి.రాధాకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

వలంటీర్లు, కన్వీనర్లు కలిసి పని చేయాలి

ఎమ్మెల్యే కొడాలి నాని


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొడాలి నాని, వేదికపై ప్రజాప్రతినిధులు

గుడివాడటౌన్(నందివాడ): ప్రభుత్వ సేవలను ప్రజలకు అందించేందుకు ఏర్పాటు చేసిన వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు కలిసి పని చేయాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) తెలిపారు. నందివాడ మండలం నందివాడ గ్రామంలోని ఓ కన్వెన్షన్ హాలులో మండలానికి చెందిన వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లకు అవగాహన సదస్సును సోమవారం నిర్వహించారు. ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి దానికి అనుబంధంగా వలంటీర్లను నియమించిందన్నారు. ప్రజల వద్దకే ప్రభుత్వ పథకాలు చేరాలనేదే దీని ముఖ్య ఉద్దేశమని చెప్పారు. ప్రజలకు సచివాలయాలకు మధ్య వారధులుగా వలంటీర్లు పనిచేస్తున్నారన్నారు. వలంటీర్ల సేవలను ప్రజలకు తెలియచేసేందుకు, వివరించేందుకు కన్వీనర్లు పనిచేస్తారన్నారు. దీని వలన వలంటీర్లకు తోడుగా మరింత మెరుగైన సేవలు ప్రజలకు చేరువ చేయాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుందన్నారు. వీరికి తోడుగా జనవరి 15వ తేదీ నుంచి గృహసారథులను నియమిస్తామని చెప్పారు. ఒక్కొక్క వలంటీర్‌కు ఇద్దరు గృహసారథులను నియమిస్తామన్నారు. వీరంతా రానున్న ఎన్నికల నాటికి ప్రజల అవసరాలను క్షుణ్ణంగా పరిశీలించి ప్రజాప్రతినిధులకు చేరవేయడం ద్వారా ప్రస్తుత ప్రజలు అవసరాలను మరిన్ని గ్రహించి పరిష్కరించడం జరుగుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన రెడ్డి తమకు వివరించినట్లు నాని పేర్కొన్నారు. ప్రభుత్వ లక్ష్యాలను నెరవేర్చాలని ఆయన కోరారు. యుద్ధప్రాతిపదికన రోడ్లు నిర్మిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ తన్నీరు నాగేశ్వరరావు, గుడివాడ నియోజకవర్గ పరిశీలకుడు ఎస్ఎంఆర్ పెదబాబు, ఎంపీపీ పెయ్యల ఆదాం, వైస్ ఎంపీపీలు పూడి సుధాకరరావు, జయరాజు, నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, జెడ్పీటీసీ కందుల దుర్గాకుమారి, నందివాడ సర్పంచ్ సరెళ్ల రత్నకుమారి, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

స్టేడియం కృషి ప్రశంసనీయం



గుడివాడరూరల్: క్రీడాకారులను ప్రోత్సహించడమే కాకుండా ప్రజానీకం ఆరోగ్య సంరక్షణకు ఎన్టీఆర్ స్టేడియం కమిటీ చేస్తున్న కృషి ప్రశంసనీయమని ఎమ్మెల్యే కొడాలి నాని పేర్కొన్నారు. స్థానిక ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఎమ్మెల్యే నాని ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. స్టేడియం కమిటీ నూతన సంవత్సర డైరీలను స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు పాలేటి చంటి, సంయుక్త కార్యదర్శి పర్వతనేని ఆనంద్(బుజ్జిబాబు)లతో కలిసి కొడాలి నాని ఆవిష్కరించారు. అనంతరం రూ.30లక్షల నిధులతో ఆధునీకరించిన స్టేడియం జిమ్‌ను ప్రారంభించి జిమ్‌లో ఏర్పాటు చేసిన ఆధునిక యంత్ర పరికరాలపై కొద్దిసేపు వ్యాయామం చేశారు. ఇండోర్ స్టేడియం వద్ద నిర్మిస్తున్న స్టేడియం కాంప్లెక్స్ నిర్మాణ పనులను పరిశీలించి పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ ఎన్టీఆర్ స్టేడియం ఆధ్వర్యంలో వివిధ రకాల క్రీడా పోటీలను నిర్వహించి స్టేడియం పేరును రాష్ట్ర వ్యాప్తంగా చాటిచెప్పేందుకు కమిటీ సభ్యులు చర్యలు తీసుకోవాలన్నారు. క్రీడాకారులను తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడాకారులకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలను కల్పించాలని ఆదేశించారు. కార్యక్రమంలో స్టేడియం కమిటీ సభ్యులు, స్టేడియం సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం


కొచ్చర్లలో సంక్షేమ పథకాల బ్రోచర్ అందజేస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్, నాయకులు

కైకలూరు(కలిదిండి): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తోందని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) అన్నారు. సర్పంచ్ ఆళ్ల రాము, ఎంపీటీసీ సభ్యురాలు నరహరిశెట్టి జయలక్ష్మి ఆధ్వర్యంలో 128వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహించారు. తొలుత గ్రామంలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాలకు ఆయన నాయకులతో కలిసి నివాళులర్పించారు. అనంతరం మూడున్నరేళ్ల కాలంలో ఆయా కుటుంబాలకు ప్రభుత్వం నుంచి అందిన సంక్షేమ పథకాల వివరాలతో కూడిన బ్రోచర్లను పంపిణీ చేశారు.

సమన్వయంతో అభివృద్ధి సాధించాలి..

ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి సచివాలయానికి రూ.20 లక్షలు అభివృద్ధి నిధులను సీఎం కేటాయించారని చెప్పారు. అత్యవసర పనులను పూర్తి చేయాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి సీఎం పాలన సాగిస్తున్నారని చెప్పారు. మన రాష్ట్రంలో అమలవుతున్నా సంక్షేమ పథకాలను ఇతర రాష్ట్రాలు సైతం ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. ఎంపీపీ చందన ఉమామహేశ్వరావు, జెడ్పీటీసీ సభ్యురాలు బొర్రా సత్యవతి, ఏఎంసీ వైస్ చైర్మన్ పాము రవికుమార్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు తిరుమాని రమేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు దాసరి చార్లెస్, సర్పంచ్‌లు నరహరిశెట్టి నరసయ్య, శింగనపల్లి రామకృష్ణ, జయమంగళ కాసులు, బత్తిన ఉమామహేశ్వరరావు, నాయకులు బలే నాగరాజు, నీలపాల భోగేశ్వరరావు, చిట్టూరి బుజ్జి, ముంగర గోపాలకృష్ణ, మంగిన భాస్కర్, భూపతి ఏసుపాదం, తహసీల్దారు తేజోమణి, అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు చావలిపాడులో..

మండవల్లి: మండలంలోని చావలిపాడు గ్రామంలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే డీఎన్నార్ ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని ఎంపీపీ రాము చెప్పారు.

పెన్షన్ల తొలగింపు వార్తలను నమ్మొద్దు

ఎమ్మెల్యే కొడాలి నాని


పెన్షన్ల పంపిణీపై చర్చిస్తున్న ఎమ్మెల్యే కొడాలి నాని, మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్

గుడివాడరూరల్: గుడివాడ పురపాలక సంఘం పరిధిలో వందలాదిగా పెన్షన్లు తొలగిస్తున్నారని జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తమని మాజీ మంత్రి, గుడివాడ ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు(నాని) స్పష్టం చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కొడాలి నానికి మున్సిపల్ కమిషనర్ పీజే సంపత్‌కుమార్ పెన్షన్ల పంపిణీ గురించి సోమవారం వివరించారు. పట్టణంలో 48 పెన్షన్లు తొలగించామని, వారిలో అధికులు మరణించిన వారివేనని కమిషనర్ తెలిపారు. ఈ మేరకు పెన్షన్ల నివేదికను కమిషనర్ నానికి తెలిపి, పట్టణ పరిధిలో 457 మందికి వివిధ రకాల నూతన పెన్షన్లు మంజూరు చేశామన్నారు. సాధారణ వెరిఫికేషన్ మాత్రమే నిర్వహించామని, అర్హత ఉన్న ఒక్క పెన్షన్ దారుడిని కూడా తొలగించలేదని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కొడాలి నాని మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలు, ఎల్లో మీడియా సృష్టించే తప్పుడు కథనాలను ప్రజలు నమ్మవద్దన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ పార్టీలతో సంబంధం లేకుండా పెన్షన్ అందించడమే రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి లక్ష్యమని చెప్పారు. పెన్షన్లతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలను కూడా అందరికీ అందజేస్తున్నామని, దీన్ని చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు, వారికి అనుకూలమైన ఎల్లో మీడియా పిచ్చి పిచ్చి కథనాలు ప్రచురించినా, ప్రచారం చేసినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని చెప్పారు. ఇప్పటికైనా తప్పుడు కథనాలను ప్రచురించడం, ప్రసారం చేయడం నిలిపివేస్తే మంచిదని హితవు పలికారు.

ఘనంగా ముక్కోటి ఏకాదశి పూజలు


విశేష అలంకారంలో వెంకటేశ్వరస్వామి వారు


కైకలూరు మీసాల వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ


ఉత్తర ద్వార దర్శనాన్ని ప్రారంభిస్తున్న చలసాని


మంటాడలో ప్రత్యేక అలంకారంలో స్వామి అమ్మ వార్లు


మండవల్లిలో విశేష పూజలు


వరహాపట్నంలో లక్ష్మీనృసింహుడు

పామర్రు/మొవ్వ/పమిడిముక్కల/తోట్లవల్లూరు: ముక్కోటి ఏకాదశిని పురస్కరించుకుని సోమవారం పలు వైష్ణవ ఆలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. స్థానిక విష్ణాలయం, రాపర్ల గ్రామంలోని గణ్యశ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, జమీదగ్గుమిల్లి గ్రామంలోని శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం, నిమ్మకూరులోని వేంకటేశ్వరస్వామి ఆలయం, పెరిశేపల్లిలోని ఆలయాల్లో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం ఉత్తర ద్వారం వద్ద దర్శనం కల్పించారు. మొవ్వ గ్రామంలోని శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం, కూచిపూడి, బార్లపూడి, భట్లపెనుమర్రు, పెదపూడి,అయ్యంకి, పెడసనగల్లు, కోసూరు, కొండవరం, పెదముత్తేవి, మొవ్వపాలెం, వేములమడ, గూడపాడు, కాజ, నిడుమోలు, మంత్రిపాలెం, అవిరిపూడి, చినముత్తేవి గ్రామాల్లోని విష్ణాలయాల్లో వేడుకలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంటాడ వెంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఉత్తర ద్వార దర్శనంకు భక్తులు బారులు తీరారు. తోట్లవల్లూరులోని శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అనంతరం గరుడ వాహనంపై స్వామి వారి గ్రామోత్సవం జరిగింది.

బారులు తీరిన భక్తులు...

గుడ్లవల్లేరు/గుడివాడరూరల్: కొతవరం శ్రీ చెన్నకేశవ స్వామివారిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ దర్శించుకుని పూజలు చేశారు. గుడ్లవల్లేరు సత్యదేవుని ఆలయం, శ్రీ వేణుగోపాల స్వామివారి ఆలయాల్లో స్వామివార్లు ఉత్తర ముఖ ద్వార దర్శనం ద్వారా భక్తులకు దర్శనమిచ్చారు. జగన్నాథపురంలోని శ్రీవెంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ నెలకొంది. తెల్లవారు జాము 4గంటలకు దేవస్థాన ధర్మకర్తల కమిటీ మాజీ చైర్మన్ చలసాని ఇందిరా రమణారావు స్వామివారి ఉత్తర ద్వార దర్శనాన్ని ప్రారంభించారు. విశేష పూజలు నిర్వహించారు.

కైకలూరులో ప్రత్యేక పూజలు

కైకలూరు/ముదినేపల్లిరూరల్/మండవల్లి: కైకలూరు మీసాల వెంకన్న స్వామి ఆలయంలో ఉత్తర ద్వారంలో స్వామి వారు దర్శినమిచ్చారు. ఎమ్మెల్యే డీఎన్నార్ దంపతులు, ఎంపీపీ అడవి కృష్ణ, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చెరుకువాడ బలరామరాజు స్వామిని దర్శించుకున్నారు. వరహాపట్నం లక్ష్మీనృసింహస్వామి, కలిదిండి మండలం తాడినాడలో అపర భద్రాద్రిగా పేరుగడించిన సీతారామ స్వామి ఆలయంలో స్వామి వార్లు ఉత్తర ద్వారంలో భక్తులకు దర్శినమిచ్చారు. వడాలి శ్రీజగన్నాథస్వామి ఆలయం, సింగరాయపాలెం లక్ష్మీనృసింహ ఆలయంలో గరుడ వాహనంపై స్వామివారు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. మండవల్లి భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి ఆలయం, స్థానిక సాయిబాబా మందిరం, వేంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాలు, కోదండరామాలయంలో స్వామివారికి పూజలు చేశారు. అల్లినగరం గ్రామంలో రాజగోపాలస్వామికి అభిషేకాలు, విశేష అర్చనలు నిర్వహించారు.

మండవల్లిలో రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం


మండవల్లి స్టేషన్‌రోడ్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్

మండవల్లి: గడప గడపకు మన ప్రభుత్వం నిధులతో స్థానిక స్టేషన్ రోడ్డు నుంచి బోయిన సత్యం ఇంటి వరకు రూ.5 లక్షలతో చేపట్టే రోడ్డు పనులను ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డీఎన్నార్ మాట్లాడుతూ.. గడప గడపకు మన ప్రభుత్వం ద్వారా గ్రామంలోని అత్యవసర పనులు గుర్తించి చేపట్టడానికి దోహదపడుతుందన్నారు. ఎంపీపీ పెద్దిరెడ్డి శ్రీరామదుర్గాప్రసాద్, పార్టీ మండల అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, సర్పంచ్ మెండా ఝాన్సీ నాయకులు ముంగర మల్లికార్జునరావు, గుడివాడ మురళీకృష్ణ, మెండా సురేష్, బుంగా రాణి పాల్గొన్నారు.

కోడిపందేల శిబిరంపై దాడి

తోట్లవల్లూరు: కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి జరిపి జూదరులను అదుపులోకి తీసుకున్న ఘటన మండలంలోని బొడ్డపాడులో జరిగింది. గ్రామంలో నిర్వహిస్తున్న కోడిపందేల శిబిరంపై ఎస్‌ఐ జి.రమేష్ ఆధ్వర్యాన పోలీసులు సోమవారం దాడి చేసి ఏడుగురిని అదుపులోకి తీసుకోవటంతో పాటు రూ.5,700, ఆరు బైకులు, కోడిపుంజు, నాలుగు కోడికత్తులు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ప్రశాంతంగా సమ్మెటివ్-1 పరీక్షలు

కైకలూరు: రాష్ట్ర విద్యా పరిశోధన, శిక్షణ మండలి(ఎస్సీఈఆర్టీ) నిర్వహణలో సమ్మెటివ్-1 పరీక్ష కైకలూరు ఓరియంటల్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం నిర్వహించారు. మొదటి ల్యాంగేజి సంస్కృతం పరీక్షను ఉదయం ఏడు, తొమ్మిది తరగతులు, మధ్యాహ్నం ఆరు, ఎనిమిది, పది తరగతుల విద్యార్థులకు నిర్వహించారు. స్కూల్ హెచ్‌ఎం కట్టా విష్ణుమూర్తి మాట్లాడుతూ మొత్తం 141 మంది విద్యార్థులు పరీక్షలు రాశారన్నారు. జనవరి 2 నుంచి 10వ తేదీ వరకు సమ్మెటివ్-1 పరీక్షలు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నిర్వహిస్తారని ఆయన తెలిపారు.

పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణ

గుడివాడరూరల్: పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు ఎయిమ్ కోచింగ్ సెంటర్ కో ఆర్డినేటర్ సీహెచ్ నితీష్‌చంద్ర సోమవారం తెలిపారు. ఎస్‌ఐ, కానిస్టేబుల్స్, ఇతర పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులకు విక్టరీ బాప్టిస్ట్ అసోసియేషన్ సహకారంతో ప్రత్యేక శిక్షణతో స్టడీ మెటీరియల్ ఇస్తామన్నారు. ఈనెల 5వ తేదీలోగా ఎయిమ్ సెంటర్ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామ్స్‌లో తమ పేర్లను రిజిస్టర్ చేసుకోవాలన్నారు. 94935 87778, 78937 89552 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

కౌతవరం పీఏసీఎస్ సేవలు అభినందనీయం


రైతులకు స్కూటీ తాళాలు అందజేస్తున్న శశిభూషణ్

గుడ్లవల్లేరు: కౌతవరం ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం(పీఏసీఎస్) సేవలు అభినందనీయమని వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్ అన్నారు. స్థానిక పీఏసీఎస్ ద్వారా ఆ సంఘాధ్యక్షుడు వడ్లమూడి నాగమోహన్ ఆధ్వర్యంలో 20 మంది రైతులకు ద్విచక్ర వాహనాలను సోమవారం ఆయన పంపిణీ చేశారు. 70 పైసల వడ్డీకే వాహనాలను అందజేశామన్నారు. త్వరలో పీఏసీఎస్ ద్వారా పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయటం ఆదర్శనీయమని శశిభూషణ్ అన్నారు. కార్యక్రమంలో డీఆర్ విజయలక్ష్మి, మేనేజర్ మల్లీశ్వరి, కార్యదర్శి జంపాన వెంకట్రామయ్య, సీఈఓ మీనాక్షి, నాయకులు బలుసు జితేంద్ర, బాడిగ నాని, ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ చీరా దుర్గా భవాని పాల్గొన్నారు.

కైకాల మృతి సినీ రంగానికి తీరని లోటు


కైకాల కళామందిరంలో కైకాల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కళాకారులు

గుడివాడరూరల్: సీనియర్ నటుడు కైకాల సత్యనారాయణ మృతి సినీరంగానికి తీరనిలోటు అని కళాకారుల సంక్షేమ సంఘ నాయకులు పేర్కొన్నారు. స్థానిక కైకాల కళామందిరంలో ప్రభాకర నాట్యమండలి ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన స్వర్గీయ కైకాల చిత్రపటాన్ని సీనియర్ కళాకారిణి అంబుల పార్వతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాట్య మండలి సభ్యులు, కళాకారులు కైకాల చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. గుడివాడ ముద్దు బిడ్డ కైకాల ప్రభాకర నాట్య మండలి ఆధ్వర్యంలో ఎన్నో ప్రదర్శనలు విజయవంతంగా నిర్వహించి సినీరంగంలోకి ప్రవేశించారని నాట్య మండలి కార్యదర్శి మట్టా రాజా తెలిపారు. గుడివాడలో కైకాల విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో కళాకారులు వంగా వంశీ, నరహరిశెట్టి ప్రసాద్, పద్మ మైక్ బుజ్జి, కొనకళ్ల సీతయ్య, పొన్నూరు రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం

ముదినేపల్లిరూరల్: గ్రామాల్లోని సమస్యల పరిష్కారానికి గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్‌లు పేర్కొన్నారు. ముదినేపల్లి, గురజ, పెదపాలపర్రు, సింగరాయపాలెం, వడాలి, బొమ్మినంపాడు సచివాలయాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. సర్పంచ్‌లు నిమ్మగడ్డ కైకమ్మ, మంచాల సరస్వతీ, గంటా రాకేష్, బోయిన విమల, మరీదు దుర్గశ్రీ పాల్గొన్నారు.

వెంట్రప్రగడ(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ సచివాలయం వద్ద ఈఓపీఆర్డీ ఎం.నాగిరెడ్డి ఆధ్వర్యంలో సోమవారం గ్రామసభ నిర్వహించారు. ఇంటి పన్నుల వసూళ్లు నూరు శాతం పూర్తి చేయాలని పంచాయతీ సిబ్బందికి సూచించారు. జగనన్న కాలనీలో ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం అయ్యేలా చర్యలు చేపట్టాలన్నారు. ఉప సర్పంచ్ వెంట్రప్రగడ గోపాలకృష్ణ, పంచాయతీ కార్యదర్శి సాగరరాణి పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం గ్రామసభలు నిర్వహించారు. మండవల్లిలో సర్పంచ్ మెండా ఝాన్సీ అధ్యక్షతన ఏర్పాటుచేసిన గ్రామసభలో పలు సమస్యలపై చర్చించారు. భైరవపట్నం, కానుకొల్లు, మండవల్లి, నుచ్చుమిల్లి, పెరికెగూడెం, ఉనికిలి గ్రామాల్లో గ్రామసభలు ఆయా గ్రామాల సర్పంచ్‌ల అధ్యక్షతన నిర్వహించారు. మాజీ సర్పంచ్ చేబోయిన వీర్రాజు, మల్లేశ్వరస్వామి ఆలయ చైర్మన్ కొల్లా కృష్ణ, ఉప సర్పంచ్, సొసైటీ ప్రెసిడెంట్ బొమ్మనబోయిన గోకర్ణయాదవ్ పాల్గొన్నారు.

కై కలూరు: ప్రజాస్వామ్య వ్యవస్థలో గ్రామసభలు ఎంతో కీలకపాత్ర పోషిస్తాయని కైకలూరు, కలిదిండి ఈఓపీఆర్డీలు రవిశంకర్, శ్రవణ్‌కుమార్ అన్నారు. సర్పంచ్‌లు దానం మేరీ నవరత్నకుమారి, మారుతీప్రసన్న ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయాల్లో గ్రామసభలు నిర్వహించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

పామర్రు: ప్రభుత్వ పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్నామని పామర్రు ఎంపీపీ దాసరి అశోక్‌కుమార్ అన్నారు. మండల పరిధి ఉరుటూరు గ్రామంలో సాంఘిక సంక్షేమ గురుకుల(బాలుర)పాఠశాలలోని విద్యార్థులను స్టడీ మెటీరియల్‌ను జెడ్పీటీసీ కె.స్వరూపరాణితో కలిసి ఆయన పంపిణీ చేశారు. నాయకులు కాకర్ల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఆశాలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.